మినుముకు ఈగ పోటు

- పైరును ఆశించిన కాండపు ఈగ
- మందులకు లొంగని వైనం
- పంట కాలం పూర్తి కాకముందే ఎండుతున్న పైరు
- ఆందోళనలో రైతన్నలు


కాండపు ఈగ ఆశించడంతో దెబ్బతిన్న మినుము మొక్కలు

పాములపాడు: రైతన్నకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. పంట చేతి కందే వరకూ కత్తి మీద సాములా తయారైంది అన్నదాతల పరిస్థితి. మినుము పైరుకు ఆశించిన కాండపు ఈగ పంటను పూర్తిగా నాశనం చేస్తోంది. ఎన్ని మందులు పిచికారీ చేసినా పురుగు ఉధృతి తగ్గడం లేదు. దీంతో పంటకాలం పూర్తి కాకముందే రైతులు కోతలకు సిద్ధమయ్యారు. గతంలో ధర బాగుండేది, చాలా మంది రైతులు లాభాలు గడించారు. ప్రస్తుతం మినుము సాగు చేసిన ప్రతి రైతు ఆందోళనకు గురవుతున్నారు.

మొదటి దశతోనే ఆగిన పూత

మండలంలో రబీ సీజన్‌లో ప్రధాన పంట మినుము 9,800 ఎకరాల్లో రైతులు ఈ పంటను సాగు చేశారు. మినుము మొక్కకు కొమ్మలు ఏపుగా పెరిగే కొద్ది పూత వస్తుంది. తొలి దశలో 35 రోజులకు, రెండో దశ 40నుంచి 55 రోజుల్లోపు, మూడో దశ 55నుంచి 65 రోజులకు పూత వస్తుంది. ఈ పూతను నిలుపుకుంటేనే దిగుబడి. అయితే ఈ సంవత్సరం మొదటగా వచ్చిన పూతతోనే నిలిచి పోయింది. కారణం కాండపు ఈగ ఆశించడమే.

కాండపు ఈగ ఉధృతి

కాండపు ఈగ అనే పురుగు తల్లి వేరులోంచి తింటూ కాండంలోకి చేరుతుంది. ఆరోగ్య కరంగా ఉన్న మొక్క పసుపు పచ్చగా మారి ఎండిపోతుంది. దీంతో పూత, కాయ ఏర్పడే పరిస్థితి లేదు. రైతులు ఎలాంటి మందులు పిచికారీ చేసినా పురుగు ఉధృతి తగ్గడంలేదు. మినుము పంట కాలం 80 నుంచి 90 రోజులు. అయితే కాండపు ఈగ పురుగు ఆశించడంతో 65–70 రోజుల్లోనే కోత కోస్తున్నారు. పైరు పూర్తిగా ఎండి పోవడంతో చేసేదేమి లేక పంట కాలం పూర్తి కాక ముందే కోత కోసి వచ్చిందే భాగ్యమని దిగుబడి తీసుకుంటున్నారు. ఎకరానికి 8 నుంచి 14 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే పొలాల్లో సైతం ఎకరాకు 1 నుంచి 5 క్వింటాళ్లలోపు దిగుబడులు వస్తున్నాయి. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో రైతులు ఉన్నారు.

పెరిగిన పెట్టుబడులు

మినుము పైరు సాగుకోసం రెండు సార్లు భూమిలో మందు, 8 సార్లు రసాయన మందుల పిచికారీ కోసం, పంటకు ఆశించిన కాండపు ఈగతో పాటు తామర పురుగు, దోమ, తెల్ల దోమ, పేనుబంక, నల్లి తదితర తెగుళ్ల నివారణకు భారీగానే ఖర్చు చేశారు. కోత, మిషన్ నూర్పిడికి దాదాపు రూ.5వేలకు పైగా ఖర్చు వస్తుంది. దాదాపు కేవలం మందులకు ఎకరాకు రూ.25,000లకు పైగా ఖర్చు అవుతుంది. ప్రస్తుతం పంట దిగుబడి ఎకరాకు 4కిటాళ్లు వస్తే గగనమైంది.

మందులకు పురుగు లొంగడంలేదు


14 ఎకరాల్లో మినుము సాగు చేశా. పైరులో పెరుగుదల లోపించింది. ఎన్నడూలేని విధంగా ఈ సంవత్సరం కాండం లోపల పురుగు ఉంది. దీంతో మొక్కలు చస్తున్నాయి. ఎన్ని మందులు కొట్టినా ఉపయోగం లేదు. కాండపు ఈగ వ్యాపించిందంటే పొలం మొత్తం పోయినట్లే.

–సురేష్, పాములపాడు

ధర గిట్టుబాటవుతుందో లేదో?


ధర అనకున్నంతగా ఉంటుందో లేదో?. ప్రస్తుతం రూ.7వేలు ఉంది. దిగుబడి చేతి కొచ్చే సరికి ఏ ధర ఉంటుందో అర్థం కాని పరిస్థితి. వ్యాపారుల చేతిలో రైతులు దారుణంగా మోస పోతున్నారు. ఏ నష్టాన్నైనా సరే రైతే భరించాలి.

–భీమ శేఖర్, రైతు, మిట్టకందాల

విత్తే సమయంలోనే మందులు వేసుకోవాలి


విత్తనం వేసే సమయంలోనే ఎకరానికి 4 మిల్లీ లీటర్ల క్లోరీ పైరిఫాస్, ఎరువులతో పాటు కార్బో ఫ్యూరాన్ గుళికలు 3జీ 10 కిలోలు, లేదా కైలాన్ 4జీ 6కిలోల చొప్పున వేయాలి. ఇలా చేయడం వల్ల కొంత వరకు కాండపు ఈగను నివారించవచ్చును. వేపనూనెను పురుగు మందులో కలిపి పిచికారీ చేసినా ఫలితం ఉంటుంది.

– ఫణీశ్వరరెడ్డి, ఏఓ

క్లుప్తంగా

సన్మార్గంలో నడవాలి


నూతన ఆలయానికి భూమిపూజ నిర్వహిస్తున్న బిషప్ ఎగ్గోని పుష్పలలిత, సంఘపెద్దలు

కొత్తపల్లి: సమాజంలో ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని దక్షిణ ఇండియా సంఘం (సీఎస్ఐ) నంద్యాల అధ్యక్ష మండలం బిషప్ ఎగ్గోని పుష్పలలిత అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో నూతన ఆలయానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలకు క్రీస్తు గురించి బోధనలను వివరించారు. ప్రతి ఒక్కరూ మంచి నడవడిక, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అనంతరం బిషప్‌ను సంఘపెద్దలు, గ్రామస్తులు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సీఎస్ఐ పాస్ట్రేట్ చైర్మన్ ఇమ్మానుయేల్ సామ్యేల్ పీటర్, సంఘపెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం

వెలుగోడు: పట్టణంలోని శ్రీ లక్ష్మీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం రామేశ్వరం నుంచి తెచ్చిన శివలింగం, 50 కలశాలకు మహన్యాస రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బళ్లాని వెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో పురోహితులు మురళి ప్రత్యేక పూజలు, విగ్రహాలకు అభిషేకం చేశారు. అనంతరము ప్రసాద వితరణ, రామేశ్వరం నుంచి తెచ్చిన 22 బావుల జలాల వితరణ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అన్నదాన పథకానికి బియ్యం విరాళం

మహానంది: మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నందిపల్లె గ్రామానికి చెందిన రైతులు 23 టిక్కీల బియ్యం బస్తాలను విరాళంగా అందించారు. అదే గ్రామానికి చెందిన సూర్యనందీశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సాగేశ్వరరెడ్డి ఐదువందల కిలోల బియ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వర్లు దాతలకు మహానందీశ్వరస్వామివారి ప్రసాదాలు అందించారు.

నేడు గృహసారథులకు శిక్షణ

వెలుగోడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్‌సీపీ గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. సాయంత్రం 4 గంటల నుంచి గాంధీనగర్ నాయకులు గోవిందు ఇంటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారని వారు చెప్పారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు.

7న ఆత్మకూరులో..

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో ఈ నెల 7 వ తేది సాయంత్రం ఆత్మకూరు పట్టణ, మండలంలోని వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు గృహసారథుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, అంజాద్‌అలీ తెలిపారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

రామకృష్ణ పరమహంస బోధనలు స్ఫూర్తి దాయకం


మాట్లాడుతున్న మల్లు వెంకటరెడ్డి

మిడుతూరు: శ్రీ రామకృష్ణ పరమహంస బోధనలు యావత్ ప్రపంచానికి స్ఫూర్తి దాయకమని తిరుమల తిరపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పైపాలెం గట్టు మీద వెలసిన శ్రీ రామకృష్ణ ఆశ్రమం 31వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచి తమ పిల్లలకు అధ్యాత్మిక భావాలు అలవర్చుకునేలా తల్లిందండ్రులు పెంచాలని చెప్పారు. ఇతిహాస గ్రంథాలు అయిన రామాయణం, మహాభారతం, భగవద్గీత తదితర వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో శివాజీ వైశ్య మఠం పీఠాధిపతులు సద్గురు ఎల్లప్ప స్వామి, లలిత పీఠాధిపతులు మేడా సుబ్రహ్మణ్యం స్వామి, ఆశ్రమ నిర్వహకులు తిరుమలయ్య, శేషన్న, స్వామి పాల్గొన్నారు.

సుంకేసులకు 720 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఆదివారం 720 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.813 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, కేసీ కాల్వకు 817 క్యూసెక్కులు విడుదల చేశామన్నారు.

సిద్ధవటంలో స్వామివారి కల్యాణోత్సవం


స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవ దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలానికి దక్షిణద్వారమైన వైఎస్సార్ జిల్లాలోని జ్యోతిసిద్ధవట క్షేత్రంలో శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల కంటే ముందుగా అక్కడ కల్యాణోత్సవం జరిపించడం ఆనవాయిగా వస్తోంది. ఇందులో భాగంగా జ్యోతి సిద్ధేశ్వరస్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, కామాక్షిదేవి అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, రుద్రహోమం జరిపించారు. సాయంత్రం స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలదేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్ లవన్న, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

శివాలయంలో లక్ష బిల్వార్చన

పాములపాడు: మండలంలోని కృష్ణారావుపేట గ్రామంలోని శివాలయంలో ఆదివారం శివలింగానికి మహా పరమేశ్వరుని ప్రీతికరమైన బిల్వ పత్రాలతో శివ స్వాములు లక్ష బిల్వార్చన నిర్వహించారు. మాఘ పర్వదిన్నాన్ని పురస్కరించుకొని తెల్లవారు జామున శివుడికి అభిషేకం, మహారుద్రాభిషేకం, పల్లకీ సేవ చేపట్టారు.

శ్రీశైల భ్రమరాంబకు ఊయల సేవ


ఊయల సేవ నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీభ్రమరాంబాదేవికి ఆదివారం పౌర్ణమి సందర్భంగా ఊయలసేవను అర్చకులు వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటల తరువాత ప్రారంభమైన ఊయల సేవలో భాగంగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్ల మూర్తులను వేంచేయింపజేసి షోడశోపచారపూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామపూజలు శాస్త్రోక్తంగా జరిపించారు.

అమ్మవారికి లక్ష కుంకుమార్చన

అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం లక్ష కుంకుమార్చన పూజలను నిర్వహించారు. ఈ పూజలో భక్తుల పరోక్ష సేవగా పాల్గొనేందుకు దేవస్థానం అవకాశం కల్పించింది. లక్ష కుంకుమార్చన పూజలో భాగంగా అర్చకులు, వేదపండితులు ముందుగా పూజా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజను నిర్వహించారు. అనంతరం లక్షకుంకుమార్చనను జరిపించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని హఠకేశ్వరం–ముఖద్వారం మార్గమధ్యంలో ఆదివారం బైక్‌ను ఫార్చునర్ (టీఎస్08ఎఫ్ఆర్1972)వాహనం ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై వస్తున్న పారిశుద్ధ్య విభాగం కార్మికుడు శివ(30)కి గాయాలయ్యాయి. క్షతగ్రాతుడిని అదే ఫార్చునర్ వాహనదారుడు ఎక్కించుకొని దేవస్థానం వైద్యశాలలో చేర్పించి వెళ్లిపోయాడు. కాగా ప్రమాదానికి కారణమైన ఫార్చునర్ వాహనదారుడిపై చర్యలు తీసుకోవాలని దేవస్థానం శానిటేషన్ విభాగం ఏఈఓ ఫణిదర్‌ప్రసాద్, సూపర్‌వైజర్‌మధు తదితరులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

వైభవంగా జ్యోతుల మహోత్సవం




జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు, కోలాటమాడతున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలో వెలసిన శ్రీచౌడేశ్వరీదేవి అమ్మవారికి ఆదివారం తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో భక్తులు జ్యోతులను సమర్పించారు. తొగట వీరక్షత్రియులు వారి ఆచారం ప్రకారం మూడేళ్లకోపర్యాయం అమ్మవారికి అంగరంగ వైభవంగా జ్యోతులు సమర్పించి మొక్కులు తీర్చుకుంటుంటారు. పూజారి పెద్దసుబ్బయ్య, చిన్నసుబ్బయ్యల ఇంటి నుంచి ఎంతో అందంగా ముస్తాబు చేసిన జ్యోతులను భక్తులు తలపై పెట్టుకొని మేళతాళాల మధ్య, భక్తుల కోలాటం, చెక్కభజనలతో ఆలయానికి బయలుదేరి ఆదివారం ఉదయం 9గంటల ప్రాంతంలో అమ్మవారికి సమర్పించారు. ఆలయానికి చేరుకున్న జ్యోతులకు అర్చకులు పూర్ణాహుతి సమర్పించి, వాటిని అమ్మవారి సన్నిధికి చేర్చి పరిసమాప్తి చేశారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ వేడుకలో పాల్గొని, కొంతసేపు జ్యోతిని తలపై పెట్టుకొని భక్తులతో పాటు నడిచారు. అనంతరం కోలాటమాడి చూపరులను అలరించారు. అనంతరం ఆలయానికి చేరుకొన్న ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే చౌడేశ్వరీదేవి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు రవీంద్రబాబు, దేశెట్టి శ్రీనివాసులు, పాణ్యం వేణుగోపాల్, పూజారి బాబు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్ దేశెట్టి సుమలత, జాకీర్‌హుసేన్, రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ షకూర్‌మియ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు విక్టర్, వనజాక్షి, పెరుమాళ్ల జాన్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే అవార్డుల ప్రదానం


అవార్డు అందుకుంటున్న పగిడ్యాల మండల ఉపాధ్యాయినులు శ్రీదేవి, మాలతి


అవార్డు అందుకున్న జూపాడుబంగ్లా మండల ఉపాధ్యాయినులు

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఏడుగురు ఉపాధ్యాయినులు సావిత్రీబాయిపూలే అవార్డు అందుకున్నారు. ఆదివారం కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో పారుమంచాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సువర్ణమ్మ, తెలుగు పండిట్ ఇలాంజియల్, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయిని ప్రసన్న, భ్రమరాంబిక, మండ్లెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని నాగలక్ష్మి, శిరీష, తరిగోపుల ఉన్నత పాఠశాల వసంతలకు ఆర్‌జేడీ ప్రతాపరెడ్డి, డైరెక్టర్ దేవేంద్రనాథ్‌రెడ్డి, కర్నూలు డీఈఓ రంగారెడ్డి పురస్కారాన్ని అందజేశారు. వీరిని పీఆర్‌టీయు రాష్ట్ర నాయకుడు జాకీర్‌హుసేన్, తదితరులు అభినందించారు.

పగిడ్యాల నుంచి 10 మందికి అవార్డు

పగిడ్యాల: సావిత్రీ బాయి పూలే ఉత్తమ మహిళా ఉపాధ్యాయిని అవార్డుకు మండలం నుంచి 10 మంది మహిళా ఉపాధ్యాయినులు ఎంపిక కావడం హర్షణీయమని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, పగిడ్యాల జెడ్పీ పాఠశాల హెచ్ఎం మధుసూదన్‌రావు, ఆదర్శ పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని శ్రీదేవి, మాలతీ (పీజీటీ ఇంగ్లీష్, ఆదర్శ పాఠశాల, పగిడ్యాల),జరీనా (కేజీబీవీ, పగిడ్యాల), జెడ్పీ పాఠశాల పగిడ్యాల, నెహ్రూనగర్, పాత ముచ్చుమర్రి నుంచి ఏ.అనురాధ, చంద్రావతి, కమల సువర్ణమ్మ, కౌసల్యబాయి, సావిత్రమ్మ, నెహ్రూనగర్, పడమర ప్రాతకోట, పాత ముచ్చుమర్రి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల నుంచి జరీనా, ఏలీషమ్మ, పార్వతమ్మలు ఎంపికైనట్లు వారు తెలియజేశారు.

'మేడం.. సీ' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, ఆర్థర్, ప్రముఖులు

నంద్యాల(వ్యవసాయం): ప్రముఖ పుస్తక రచయిత, వార్తా రచనల్లో అందవేసిన చేయిగా పేరు పొందిన కాశీపురం ప్రభాకర్‌రెడ్డి రచించిన మేడం సీ పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం స్థానిక రామకృష్ణ పీజీ కళాశాలలో ఎమ్మెల్యేలు శిల్పాచక్రపాణిరెడ్డి, తొగూరు ఆర్థర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రభాకర్‌రెడ్డి సాహితీ స్పర్శ వారసత్వంగానే లభించిందని, తనలో ఉన్న సాహితీ పిపాస ఆయనను నిద్రపోనివ్వలేదని, తనదైన ప్రతి అనుభవం ముఖపుస్తకంలో పేజీ నింపేదని కొనియాడారు. రచయిత కాశీపురం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ సంస్కృతిపై నెలకొన్న అపోహలను తొలగిస్తూ క్రికెట్ క్రీడ కేంద్రీకృతంగా ఒక యువతి చేసిన సాహసోపేత ప్రయాణమే తాను రాసిన మేడం సీ నవల అని చెప్పారు. వంద పుస్తకాలను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కొనుగోలు చేసి ప్రముఖులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్వీ యూనివర్సిటీ మాజీ వీసీ భూమన కుసుమ కుమారి, రాయలసీమ అధ్యయన వేదిక అధ్యక్షుడు భూమన్, ప్రఖ్యాత రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవికృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ సహదేవుడు, రాకేష్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

మహా'నంది'కి మెరుపులు


విద్యుద్దీపాలతో మెరిసిపోతున్న మహా'నంది'

మహానంది: నల్లమల అడవుల్లో వెలిసిన మహానంది మహానందానికి నిలయం. పచ్చటి చెట్లు, పక్షుల కిలకిలరావాలతో ఆలయ పరిసరాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తుంటాయి. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ. 2 కోట్ల సొంత నిధులతో చేపట్టిన సుందరీకరణ పనుల్లో భాగంగా రాతి నంది విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన పచ్చదనం, అధునాతనమైన లైటింగ్ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.


ఆకట్టుకుంటున్న రాతి నంది విగ్రహం


రంగురంగుల విద్యుత్ దీపాలవెలుగులో..

ఘనంగా బార్తాల పున్నమి


ఆత్మకూరు పట్టణంలో వెలసిన జమ్ములమ్మదేవి

ఆత్మకూరు: పట్టణంలోని జమ్ములమ్మ(ఎల్లమ్మ) దేవాలయంలో మాఘ పూర్ణిమ, బార్తాల పౌర్ణమి సందర్భంగా ఆదివారం అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద ఎత్తున మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా కుటుంబసమేతంగా ఆలయానికి చేరుకున్నారు. పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చనలు, నిమ్మకాయలు, పూలమాలలతో పాటు సారె సమర్పించారు. ఘనంగా బారసాల పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నారాయణ విద్యావిహార్ అధినేత గంజిరాజశేఖర్, గంజికుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చౌడేశ్వరీ దేవికి ప్రత్యేక పూజలు

పాములపాడు: మండల కేంద్రంలోని చౌడేశ్వరీదేవి అలయంలో ఆదివారం బార్తాల పున్నమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అమ్మవారికి చీర, గాజులు, పసుపు, కుంకుమలను అందజేశారు. నైవేద్యాలను సమర్పించారు.

కొత్తపల్లి: మండల కేంద్రం శివారుల్లో వెలసిన జమ్ములమ్మ దేవాలయంలో బార్తాల పున్నమి సందర్భంగా కొత్తపల్లి గ్రామానికి చెందిన పల్లా పడగల అయ్యగారి వారసులు పూజారి కుమ్మరి శివకుమార్ దంపతులు ఆనవాయితీ ప్రకారం అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చన, పూల అలంకరణ, తదితర విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

జూపాడుబంగ్లా: మండలంలోని 80బన్నూరు సమీపంలోని శ్రీజంబులాపరమేశ్వరీదేవి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేకపూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.

పగిడ్యాల: మండలంలోని పీకే ప్రాగటూరు, నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, ఆంజనేయనగర్, బీరవోలు, సంకిరేణిపల్లె, పగిడ్యాల, పాలమర్రి, లక్ష్మాపురం, తూర్పు,పడమర ప్రాతకోట, ఎం, ఎస్. ఘణపురం, రైతుపల్లె, వనుములపాడు తదితర గ్రామాల్లోని ప్రజలు సుంకుల పరమేశ్వరి, జంబులమ్మ దేవతా మూర్తులకు ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి భక్తిని చాటుకున్నారు.

మిడుతూరు: స్థానిక శ్రీ సుంకులపరమేశ్వరీ ఆలయం, వన దేవతలైన వసుదేవమ్మ, గజ్జల పాపమ్మ, లక్ష్మీ దేవమ్మతదితర అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకొని నైవేద్యం సమర్పించారు.

కనుల పండువగా విగ్రహాల ప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన అల్వార్ విగ్రహాలు

వెలుగోడు: పట్టణంలో శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానంలో అల్వార్ విగ్రహాల ప్రతిష్ఠ కనుల పండుగగా నిర్వహించారు. ఆదివారం దేవస్థానానికి సంబంధించిన ధర్మకర్తలు, ముడుంబై వంశస్తులు వివిధ రాష్ట్రాల నుంచి 150 మంది పాల్గొని 12 అల్వార్ విగ్రహా ప్రతిష్ఠలు, శాంతి కల్యాణము, పురోహితులు యజ్ఞ నారాయణ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం చెన్నకేశవ స్వామి దేవాలయంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముడుంబై వంశస్తుడు రిటైర్డ్ డీఎల్‌పీఓ మధుసూదన శర్మ తదితరులు పాల్గొన్నారు.


ముడుంబై వంశస్తుల ఆత్మీయ సమ్మేళనం